క్లుప్తంగా

శ్రీవారి భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కార్పొరేషన్ రెవెన్యూ అధికారి కేఎల్.శర్మ, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, తిరువలి శనివారాలను పురస్కరించుకుని శనివారం సరోజినీ దేవి రోడ్డులోని భక్తాంజనేయ సీతారామ ఆలయ ధర్మకర్తలు ట్రెక్కింగ్ రమణ, బాలు ఆధ్వర్యంలో శ్రీవారి భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి కెఎల్.వర్మ మాట్లాడుతూ ప్రతి ఏటా తిరువలి శనివారాల సందర్భంగా శ్రీవారి భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీ అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త ఆర్ఆర్.శ్రీనివాస్ వారి మిత్ర బృందం సహకారంతో అన్నదానం చేసినట్టు పేర్కొన్నారు.

ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల...



అన్నదానం చేస్తున్న ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రా బ్యాంకు ప్రారంభించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు శనివారం అలిపిరి నుంచి తిరుమలకు నడిచి వెళ్లే శ్రీవారి భక్తులకు అన్నదానం చేశారు. ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు కృష్ణమూర్తి, మునిరత్నం నాయుడు మాట్లాడుతూ భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆలోచన మేరకు 1923లో ఆంధ్రా బ్యాంకును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేటికి వందేళ్లు పూర్తయిందని, ఈ క్రమంలో అన్నదానం చేసినట్టు పేర్కొన్నారు. నడింపల్లి కృష్ణ, శ్రీకాంత్, సుబ్రమణ్యం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్సీ అమలుచేయాలని వినతి



పాకాల : రెగ్యులర్ ఉద్యోగులతోపాటు తమకూ పీఆర్సీ అమలు చేయాలని మండల సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు కోరారు. వారు శనివారం ఎంఈవో బాబ్జీకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. చైల్డ్ కేర్ సెలవులు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో శనివారం స్విమ్స్, పద్మావతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఆయుష్మాన్ భవ కింద వైద్య శిబిరాలు నిర్వహించి పలు విభాగాల వైద్య నిపుణులతో ప్రజలకు వైద్య పరీక్షలు చేయిస్తున్నట్టు తెలిపారు. వ్యాధి ఉన్నట్లు నిర్ధారిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా చికిత్స చేయించడంతోపాటు మందులు అందజేస్తామన్నారు. వైద్య శిబిరానికి 420 మంది హాజరు కాగా 187 మందికి వైద్య పరీక్షలు చేశారు. పద్మావతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఉషాకళావతి, మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, షీలాభాను తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

తిరుపతి లీగల్: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ తెలిపారు. పద్మావతి వైద్య కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులకు కళాశాలలో సీటు పోవడమే కాకుండా ఏ కళాశాలలోనూ సీటు చిక్కదన్నారు. జీవితం అంధకారం అవుతుందని తెలిపారు. పద్మావతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉషా కళావతి, గణేష్‌కుమార్, న్యాయవాదులు వజ్రాల చంద్రశేఖర్, మనోజ్‌కుమార్, వసుమతి పాల్గొన్నారు.

నరేంద్ర మృతిపై పలు అనుమానాలు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సీమల్లవరం పంచాయతీ కాలూరుకు చెందిన నరేంద్ర(26) మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి! ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న నరేంద్ర ఈనెల 20వ తేదిన మధ్యాహ్నం కాలూరులోనే ఓ హోటల్లో ఎగ్‌ఫ్రైడ్ రైస్ తిన్న తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఓ ప్రైవేటు క్లినిక్‌లో చికిత్స తీసుకున్న ఆరోగ్యం మెరుగుకాకపోవడంతో రాత్రికి మృతిచెందాడు. అయితే అనుమానాస్పద మృతిగా తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. కలుషిత ఎగ్ ఫ్రైడ్ రైస్ తినడం వల్లనా, కాలూరులో డాక్టర్‌గా చెలామణి అవుతున్న అర్హత లేని డాక్టర్ బంధువుల వైద్యం వల్లనా, లేక ఫ్రెండ్స్ ఏమైనా విష ప్రయోగం చేశారా.. అనే కోణంపై నరేంద్ర తల్లిదండ్రులు మహేంద్ర, వెంకటలక్ష్మి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



హనుమంత వాహనంపై రాముడిగా భక్తులకు దర్శనం ఇస్తున్న శ్రీమల్లయప్పస్వామి

కనుల పండువగా సప్తగిరీశుడి బ్రహ్మోత్సవాలు

తిరుమల : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మలయప్ప స్వామి శనివారం ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళాబృందాల నత్యాలు, కోలాటాలు, భజనలు అలరించాయి. ఆలయంపై పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

నేడు సూర్యప్రభ వాహనం

బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజు ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సూర్యప్రభ వాహన ఊరేగింపు నిర్వహిస్తారు. సప్త అశ్వాలపై అనుడు రథసారథిగా ఎర్రటి పూలమాలలు ధరించి స్వామివారు ఈ వాహనం మీద కొలువుదీరి ఊరేగుతారు. ప్రపంచానికి వెలుగు ప్రసాదించే సూర్య భగవానుడికి తానే ప్రతిరూపం అని స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

చంద్రప్రభ వాహనం

ఏడోరోజు ఆదివారం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు స్వామివారు తెల్లటి వస్త్రాలు, పువ్వుల మాలలు ధరించి చంద్ర ప్రభ వాహనంపై కొలువై చల్లని వాతావరణంలో తిరువీధుల్లో విహరిస్తారు. సూర్యుడి తీక్షణం, చంద్రుని శీతలత్వం రెండు తన అంశేనని ఈ వాహనాల ద్వారా స్వామి తెలియజేస్తారు.



స్వర్ణరథాన్ని లాగుతున్న టీటీడీ చైర్మన్ సతీమణి భూమన రేవతి, మేయర్ శిరీష తదితరులు

ఇస్కాన్‌లో ఘనంగా రాధాష్టమి వేడుకలు

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ మందిరంలో శనివారం శ్రీకృష్ణ భగవానుని ఇష్టసఖి రాధాదేవి జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి తర్వాత 18వ రోజు రాధాష్టమి వేడుకలు నిర్వహించడం ఆవాయితీ. ఇందులో భాగంగా తిరుపతి ఇస్కాన్‌లోని శ్రీరాధాగోవింద కమల మందిరంలో ఉదయం 8.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు రాధాగోవిందులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు రాధాగోవిందుల ఉత్సవమూర్తులకు మహా శంఖాభిషేకం చేపట్టారు. 12.30 నుంచి 1.30 గంటల వరకు రాధారాణి లీలలపై ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతిరమణ దాస్ ప్రత్యేక ప్రవచనం చేశారు. భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. ఇస్కాన్ మందిరం కార్యదర్శి లీలా పారాయణదాస్, రూపేష్ ప్రభు పాల్గొన్నారు.



ఆద్యంతం భక్తి పారవశ్యం సంగీత గానామృతం

తిరుమల/తిరుపతి కల్చరల్: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో 6వ రోజైన శనివారం తిరుమల, తిరుపతిలోని పలు వేదికలపై టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుమల ఆస్థాన మండపంలో ఉదయం వేద సందేశం, పద్మావతి దేవి బృందం విష్ణు సహస్రనామ పారాయణం, మాధవీలత బృందం భక్తి సంగీతం, ఆచార్య చక్రవర్తి రంగనాథ భక్తామృతం ధార్మికోపన్యాసం అలరించాయి. సాయంత్రం మధుసూదన్ రావు బృందం అన్నమయ్య విన్నపాలు, జోత్స్న బృందం హరికథా పారాయణం చేపట్టారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు నాదలయ సురభి బృందం భక్తి సంగీతం, అన్నమాచార్య కళామందిరంలో గోపాలరావు బృందం సంగీతం, రామచంద్ర పుష్కరిణి వేదికపై శ్రీవల్లీ బృదం నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.



మహతిలో వీణ వాయిద్య సంగీత కచేరి నిర్వహిస్తున్న నాదాలయ సురభి కళా బృందం

ఘనంగా వినాయక చవితి వేడుకలు



అన్నదానం చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ధర్మకర్త కరుణాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా శనివారం తుమ్మలగుంటలోని ప్రసన్నాంజనేయ ఆలయం వద్ద భక్తులకు తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సొంత నిధులతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దొడ్ల కరుణాకర్‌రెడ్డి, బిరుదాల గుణశేఖర్ రెడ్డి, ఢిల్లీరెడ్డి, ధనుంజయరెడ్డి, నితీష్, హరీష్, గోపాల్, ముఖేష్, చక్రి, చరణ్ పాల్గొన్నారు.



తిరుపతి నగరంలో శనివారం పగలు భానుడు భగభగలు కురిపించాడు. రాత్రి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం నల్లని మేఘాలతో నిండిపోయింది. ఆకాశం కింద పడుతుందా అన్న విధంగా పెద్ద పెద్ద శబ్దంతో ఉరుములు, ఆకాశం కాంతి వంతంగా మిరుమిట్లు గొలుపుతూ మెరుపులు మెరవడంతో నగర వాసులు భీతిచెందారు. కొందరు విద్యుల్లతల అందాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి



శ్రీవారి సేవలో సినీ నటుడు శ్రీకాంత్



తిరుమల: శ్రీవారిని ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

పిల్లలకు గుర్తింపు కార్డులు



చంద్రగిరి: వలస కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌టీసీ)కు విశేష ఆదరణ లభిస్తోంది. ఐతేపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ దంపతులు సొంత నిధులతో శనివారం పిల్లలకు గుర్తింపు కార్డులు అందజేశారు. మధ్యాహ్నం భోజనం కోసం రూ.4 వేలు ఇచ్చారు. ఎంఈవో లలిత కుమారి మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి పేద పిల్లలకు చేయూత ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో–2 భాస్కర్ బాబు, సర్పంచ్ వెంకటయ్య, హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయురాలు శాంతమ్మ, రేవతి పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన



తిరుపతి కల్చరల్: ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్వీ అరవింద కంటి ఆసుపత్రిలో అవయవదానం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌వో శ్రీహరి మాట్లాడుతూ అవయవ దానం ఆవశ్యకత, కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవయవ దానంపై ప్రతిజ్ఞ చేయించారు. డీపీఎంవో శ్రీనివాసరావు, సూర్యవంశీ, అరవింద ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్ వర్ధన్ పాల్గొన్నారు.



స్వర్ణరథంలో స్వామికి హారతులు



వాహన సేవలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి దంపతులు





వాహన సేవల్లో కళా బృందాల ప్రదర్శనలు

తప్పులు లేని ఓటరు జాబితాయే లక్ష్యం

తిరుపతి కల్చరల్: తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేయాలని తిరుపతి నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె శనివారం కచ్చపి ఆడిటోరియంలో ఓటరు జాబితా తయారీపై బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే సర్వే చేసి ఇచ్చిన జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. చనిపోయిన వారి పేర్లను తొలగించే ప్రక్రియలో కుటుంబ సభ్యుల నుంచి దరఖాస్తు తీసుకోవాలని, డెత్ సర్టిఫికెట్ కచ్చితంగా ఉండాలన్నారు. సోమవారం నుంచి మరో సారి పూర్తిగా అభ్యంతరాలు, చేరికలు, తొలగింపును క్షుణ్ణంగా పరిశీలించి తగు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఓటరు నమోదు అదనపు అధికారులు డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, రెవెన్యూ అధికారులు కేఎల్.వర్మ, సేతుమాధవ్, డీటీ జీవన్, ఆర్ఐలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ హరిత

ఘనంగా ప్రారంభమైన సైన్స్ సెంటర్ వార్షికోత్సవాలు

తిరుపతి కల్చరల్: రీజనల్ సైన్స్ సెంటర్‌లో శనివారం 30వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు సైన్స్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన 130 ఔషధ మొక్కలు, వివిధ వ్యాధులకు సంబంధించి 17 విభాగాలతో కూడిన హెర్బల్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి పాల్గొన్నారు. అలాగే సైన్స్ సెంటర్ 30వ వార్షికోత్సవం సందర్భంగా రూపొందించిన పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ఏర్పాటు చేసిన రీజనల్ సైన్స్ సెంటర్ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించే దిశగా విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మాట్లాడుతూ ఎంతో ఉన్నత లక్ష్యాలతో ప్రారంభించిన సైన్స్ సెంటర్ ప్రతి ఏటా విద్యార్థులు, ప్రజలకు అనువైన అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సైన్స్ సెంటర్ 30వ వార్షికోత్సవం సందర్భంగా 27వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం సైన్స్ సెంటర్‌లో ప్రత్యేకంగా కొత్త సైన్స్ షో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



హెర్బల్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న వీసీ కె.రాజారెడ్డి, సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ

తిరుపతి అపోలో ఆసుపత్రిలో గుండె వైద్య సేవలు

తిరుపతి కల్చరల్ : తిరుచానూరు రోడ్డులోని లక్ష్మీపురం సర్కిల్‌లోనున్న అపోలో క్లినిక్‌లో ప్రతి నెలా 4వ శనివారం గుండె వైద్య సేవలను అందించనున్నట్టు ప్రముఖ గుండె వైద్య నిపుణుడు ఎస్.విజ్ఞ చరణ్ తెలిపారు. ఆయన శనివారం అపోలో ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ ప్రజలకు మెరుగైన గుండె వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ప్రతి నెలా 4వ శనివారం తాను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య సేవలు అందిస్తానని, అవసరమైన వారికి నెల్లూరు అపోలో ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేస్తామన్నారు. ఏ అపోలో ఆసుపత్రిలోనూ లేనివిధంగా ఓపెన్‌హార్ట్ సర్జరీలను అతి తక్కువ ఖర్చుతో చేస్తున్నట్టు వివరించారు. అపాయింట్‌మెంట్ కోసం 7660008821, 9491139025లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ

తిరుపతి రూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధి హామీ పనులపై 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–2023లో గ్రామ పంచాయతీల్లో చేసిన ఉపాధి పనులు, చేసిన ఖర్చు, తమ తనిఖీల్లో తేలిన విషయాలను డీఆర్పీలు చదివి వినిపించారు. రూ.15,372 అవినీతి జరిగినట్టు తేల్చారు. ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఎంపీడీవో వెంకటనారాయణ ఆదేశించారు. పీడీ శ్రీనివాస్ ప్రసాద్, విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఏపీడీ పద్మలత ఉపాధిహామీ పథకం సిబ్బందికి పలు సూచనలు చేశారు. జెడ్పీటీసీ రత్నమ్మ, జిల్లా అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, ఆవులయ్య, ఏపీవో మమత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ

తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం స్వామి వారు హనుమంతుడిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కల్యాణ వెంకన్నకు చంద్రగిరి వాసులు సారె సమర్పించారు. వారికి ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. - తిరుపతి రూరల్



కల్యాణ వెంకన్నకు సారె సమర్పించేందుకు వస్తున్న చంద్రగిరి మండల ప్రజలు



సారె తీసుకువస్తున్న చంద్రగిరి పంచాయతీ ప్రజలు



కళాకారుల ప్రదర్శనలు



వాహన సేవలో పాఠశాల విద్యార్థులు